సాక్షి మహబూబ్‌నగర్

శుక్రవారం ❘ 29 ❘ డిసెంబర్ ❘ 2023

గరిష్ఠం/కనిష్ఠం 34.1 /11.8

వాతావరణం

చలి తీవ్రత అధికంగా ఉండి అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం , రాత్రివేళలో చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కాంగ్రెస్ హయాంలోనే దేశ పురోభివృద్ధి



స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే దేశం అన్నిరంగాల్లో పురోభివృద్ధి సాధించిందని, ప్రపంచ దేశాలతో పోటీపడేలా నిలిచిందని దేవరకద్ర ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం పార్టీ 139వ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ముందుగా జిల్లా అధ్యక్షుడు పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎందరో మహానుభావులు స్వాతంత్య్రం కోసం పోరాటం చేశారని గుర్తుచేశారు. రాష్ట్రంలో అరాచక పాలనను ప్రజలు అంతమొందించి కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారని, సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజల వద్దకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతో ప్రజాపాలనకు శ్రీకారం చుట్టామని చెప్పారు. వచ్చేనెల 6 వరకు గ్యారంటీ పథకాలకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, అవసరమైన పథకాలు అందిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సంక్షేమ పథకాలు అందుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్, నాయకులు ఎన్పీ వెంకటేశ్, చంద్రకుమార్‌గౌడ్, సీజే బెనహర్, అన్వర్‌పాష, సిరాజ్‌ఖాద్రీ, లక్ష్మణ్ యాదవ్, అబ్దుల్ హక్, రాములుయాదవ్, అవేజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ ఎన్నికపై హైకోర్టు స్టే

మిడ్జిల్: వచ్చే నెల 4న చేపట్టనున్న మండల ఎంపీపీ ఎన్నికపై హైకోర్టు స్టే విధించిందని ఎంపీపీ సుదర్శన్ తెలిపారు. కొంత మంది ఎంపీటీసీ సభ్యులు అవిశ్వాసం పెట్టడంతో 4న ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహించాలని అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. దీనిపై ఎంపీపీ సుదర్శన్ హైకోర్టును ఆశ్రయించడంతో గురువారం స్టే ఇచ్చినట్లు చెప్పారు. అయితే వైస్ ఎంపీపీ ఎన్నికపై ఎలాంటి నిర్ణయం రాలేదని ఎంపీడీఓ కార్యాలయ అధికారులు తెలిపారు.

కందులు క్వింటా రూ.8,911

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం కందులకు క్వింటాల్ గరిష్టంగా రూ.8,911, కనిష్టంగా రూ.8,670 ధర లభించింది. అలాగే వేరుశనగ క్వింటాలు గరిష్టంగా రూ.7,630, కనిష్టంగా రూ.4,789, వరి ఆర్ఎన్ఆర్ రకం ధాన్యానికి క్వింటాల్ గరిష్టంగా రూ.3,189, కనిష్టంగా రూ.2,448, హంస రకానికి గరిష్టంగా రూ.2,229, కనిష్టంగా రూ.1,960, చిట్టి ముత్యాలు రూ.3,086, మొక్కజొన్నకు గరిష్టంగా రూ.2,273, కనిష్టంగా రూ.1,960, రాగులు రూ.2,069 ధరలు వచ్చాయి.

ఆలయాల సమస్యలపై సుదీర్ఘ చర్చ

- వివరాలు 12లో..

82,873

ఉమ్మడి జిల్లాలో తొలిరోజు వచ్చిన అర్జీలు



బాలానగర్ మండలం పెద్దరేవల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల మేరకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు అభయహస్తం కార్యక్రమంలో భాగంగా అధికారులు గురువారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా మండలాల్లో గ్రామాలు, మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా ప్రజాపాలన సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. తొలిరోజు 76 మండలాల్లోని 237 గ్రామాల్లో 58,588 దరఖాస్తులు వచ్చాయి. 19 మున్సిపాలిటీల పరిధిలో 260 వార్డుల నుంచి 24,285 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొత్తంగా తొలిరోజు 82,873 దరఖాస్తులు వచ్చాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో 71 గ్రామాలు, 22 మున్సిపల్ వార్డుల్లో, నాగర్‌కర్నూల్ జిల్లాలో 49 గ్రామాలు, 86 మున్సిపల్ వార్డుల్లో, నారాయణపేట జిల్లాలో 31 గ్రామాలు, 56 పురపాలిక వార్డుల్లో, వనపర్తి జిల్లాలో 48 గ్రామాలు, 80 వార్డుల్లో, జోగుళాంబ గద్వాలజిల్లాలో 38 గ్రామాలు, 16 మున్సిపల్ వార్డుల్లో సభలు నిర్వహించి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. మహబూబ్‌నగర్ పురపాలికలోలని పాతపాలమూరు, నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని అమ్రాబాద్ మండల కేంద్రం, మన్ననూర్‌తోపాటు పలు గ్రామాలు, వనపర్తి మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో దరఖాస్తు ఫారాల కొరత నెలకొంది. అధికారుల సూచన మేరకు దరఖాస్తుదారులు జిరాక్స్ ప్రతులు నింపి అందజేశారు. ఈ క్రమంలో పలు జిరాక్స్ సెంటర్ల వద్ద సందడి నెలకొంది. కాగా, ఆరు గ్యారెంటీలకు దరఖాస్తులు స్వీకరించగా.. పలు ప్రాంతాల్లో ధరణి తదితర సమస్యలపైనా అర్జీలు వచ్చాయి. ఇవి సుమారు 200 వరకు ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఆరు గ్యారెంటీల దరఖాస్తుల స్వీకరణ సందర్భంగా ప్రజల నుంచి పలు సందేహాలు వ్యక్తమయ్యాయి. అధికారులు సమాధానాలు చెప్పలేక తలపట్టుకున్నారు.

పాలమూరులో పండుగలా ప్రజాపాలన సభలు

- పలు ప్రాంతాల్లో దరఖాస్తు ఫారాల కొరత
- జిరాక్స్ సెంటర్లకు ప్రజల పరుగులు

జిల్లాల వారీగా దరఖాస్తులు ఇలా..

జిల్లా	దరఖాస్తులు		
	మండలాల్లో	మున్సిపాలిటీల్లో	మొత్తం
మహబూబ్‌నగర్	13,899	4,948	18,847
నారాయణపేట	15,825	3,941	19,766
వనపర్తి	5,830	5,391	11,221
జో.గద్వాల	7,132	4,408	11,540
నాగర్‌కర్నూల్	15,902	5,597	21,499
మొత్తం	58,588	24,285	82,873

విశేష స్పందన

- ఆరు గ్యారంటీల కోసం పోటెత్తిన ప్రజలు
- మొదటిరోజు అయోమయానికి గురిచేసిన కార్యక్రమం
- జిల్లావ్యాప్తంగా దరఖాస్తులు సమర్పించిన 18,847 కుటుంబాలు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: రాష్ట్ర ప్రభుత్వం 'ఆరు గ్యారంటీ'ల అమలులో భాగంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన సభలకు విశేష స్పందన లభించింది. అధికారులే గ్రామాలు, వార్డులకు వచ్చి ప్రజా సమస్యలతోపాటు ఆరు గ్యారంటీ పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించడంతో హడావుడి నెలకొంది. పంచాయతీల్లో గ్రామసభ, మున్సిపాలిటీల్లో వార్డు సభల నిర్వహణకు గురువారం నుంచి జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామాలు, వార్డుల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల వద్ద ఉచిత దరఖాస్తుల కోసం జనాలు బారులుతీరారు. మొదటిరోజే పోటెత్తిన జనంతో దరఖాస్తు ఫారాల పంపిణీతోపాటు నింపడం, స్వీకరణకు ఇబ్బందులు పడ్డారు. జిల్లాలోని పలు కేంద్రాల వద్ద దరఖాస్తుల కొరత ఏర్పడటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. వచ్చేనెల 6 వరకు దరఖాస్తులు సమర్పించేందుకు గడువు ఉంది. కాగా.. జిల్లాలోని 16 మండలాలు, 3 మున్సిపాలిటీల్లో ప్రజాపాలన గ్రామసభల నిర్వహణతోపాటు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ, ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు 48 బృందాలను ఏర్పాటు చేశారు.

పెద్దఎత్తున దరఖాస్తులు..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభల్లో మొదటిరోజు జిల్లావ్యాప్తంగా ప్రజలు పెద్దఎత్తున దరఖాస్తులు సమర్పించారు. జిల్లాలో మొత్తం 441 గ్రామాలు ఉండగా.. మొదటి రోజే 71 గ్రామాల్లో సభలు నిర్వహించారు. ఇందులో జిల్లావ్యాప్తంగా 31,289 మంది ప్రజలు పాల్గొనగా.. ఆరు గ్యారంటీల పథకాల కోసం 13,899 మంది దరఖాస్తులు సమర్పించారు. అలాగే జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో 22 వార్డు సభలలో 14,628 మంది హాజరుకాగా 4,948 దరఖాస్తులు వచ్చాయి.



మహిళతో మాట్లాడుతున్న 'ప్రజాపాలన' నోడల్ అధికారి టీకే శ్రీదేవి

అనేక సందేహాలు..

ప్రజాపాలన గ్రామసభలపై అనేక సందేహాలు వ్యక్తమయ్యాయి. ప్రధానంగా వలస కార్మికుల కుటుంబాలు, ఇది వరకే సంక్షేమ పథకాలు అందుతున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చా.. రెండు గ్రామాల శివారుల్లో భూములున్న వారు ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలి.. వేరు పడిన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు, పేర్ల నమోదు, రైతు భరోసా కింద కౌలు రైతులు తెలపాల్సిన సర్వే నంబర్లు పట్టాదారులు ఎలా ఇస్తారు అనే అనుమానాలు తలెత్తాయి. ఇదిలా ఉండగా ఆరు గ్యారంటీల దరఖాస్తులతోపాటు ఇతర సమస్యలపై కూడా గ్రామసభల్లో వందల సంఖ్యలో దరఖాస్తులు సమర్పిస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ

బాలానగర్ మండలం పెద్దరేవల్లిలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభను జిల్లా నోడల్ అధికారి టీకే శ్రీదేవి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దరఖాస్తులను ఉచితంగా అందజేయడంతోపాటు వివరాలను నింపేందుకు సైతం సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. వచ్చేనెల 6 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే కలెక్టర్ రవినాయక్ జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో కలిసి జడ్చర్ల మండలం మాచారంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభతోపాటు మహబూబ్‌నగర్‌లోని షాసాబ్‌గుట్ట తండాలో నిర్వహించిన వార్డు సభలో కలెక్టర్ పాల్గొన్నారు. అలాగే పాతపాలమూరు, తిమ్మసానిపల్లి, అప్పన్నపల్లి వార్డు సభల్లో ఆర్డీఓ అనిల్‌కుమార్ పాల్గొని దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

మొదటి రోజు ఇలా..

మండలం	మొత్తం గ్రామాలు	ని.స.	వ.ద.
అడ్డాకుల	17	4	581
బాలానగర్	37	6	511
భూత్పూర్	18	4	821
చిన్నచింతకుంట	18	4	1,167
కౌకుంట్ల	12	2	448
దేవరకద్ర	23	4	384
గండేడ్	27	4	522
మహమ్మదాబాద్	22	4	652
హన్వాడ	35	6	748
జడ్చర్ల	45	6	813
కోయిలకొండ	44	6	2,863
మ.నగర్ రూరల్	26	4	757
మిడ్జిల్	24	4	865
మూసాపేట	15	4	249
నవాబ్‌పేట	54	5	2,017
రాజాపూర్	24	4	501

పురపాలికల్లో..

మున్సిపాలిటీ	మొత్తం వార్డులు	ని.స.	వ.ద.
మహబూబ్‌నగర్	49	8	3,133
జడ్చర్ల	27	4	1,260
భూత్పూర్	10	10	555

ని.స.: నిర్వహించిన సభలు,
వ.ద.: వచ్చిన దరఖాస్తులు

ఈ-చలాన్స్‌పై స్పెషల్ డ్రైవ్

ఒకేరోజు రూ.16,60,435 నగదు చెల్లింపు

మహబూబ్‌నగర్ క్రైం: రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఈ-చలాన్స్‌పై ప్రభుత్వం రాయితీలు కల్పించిన నేపథ్యంలో గురువారం పోలీసులు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సుభాష్ చౌరస్తాలో డ్రైవ్ నిర్వహించి వాహనదారులకు పెండింగ్ ఈ-చలాన్స్‌పై అవగాహన కలిగించడంతోపాటు నేరుగా ఆన్‌లైన్‌లో ఈ-చలాన్ డబ్బులు చెల్లించే విధంగా ఏర్పాటు చేశారు. వాహనదారులు పోలీసులు ఏర్పాటు చేసిన స్కానర్స్ ద్వారా ఆన్‌లైన్‌లో స్కాన్ చేసి ఈ-చలాన్ డబ్బులు చెల్లించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రాయితీలు భారీగా ఉన్న నేపథ్యంలో వాహనదారుల నుంచి కూడా మంచి స్పందన వస్తోంది. జిల్లావ్యాప్తంగా గురువారం ఒక్కరోజే 13,195 పెండింగ్ ఈ-చలాన్ కేసులలో రూ.16,60,435 నగదు చెల్లించారు. ఇక ప్రభుత్వం రాయితీ ప్రకటించినప్పటి నుంచి ఇప్పటి వరకు 21,873 కేసులకు సంబంధించి రూ.28,39,300 వసూళ్లయ్యాయి. మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు 785 వాహనాల నుంచి రూ.70 వేల పెండింగ్ చలాన్స్ వసూలు చేశారు.



ఈ-చలాన్స్‌పై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు

ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోండి



షాసాబ్‌గుట్ట తండాలో దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్


మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలకు అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రవినాయక్ అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన మున్సిపాలిటీలోని షాసాబ్‌గుట్ట తండాలో నిర్వహించిన వార్డు సభకు హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఆయా పథకాల లబ్ధి కోసం ప్రజా పాలనలో దరఖాస్తులు స్వీకరిస్తుందని అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజాపాలన నిర్వహణలో భాగంగా జిల్లాలోని 17 మండలాలు, 3 మున్సిపాలిటీలకు 48 బందాలను ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని, మండలంలో ఉదయం ఒక గ్రామం, సాయంత్రం ఒక గ్రామం చొప్పున రోజుకు 2 గ్రామసభలు నిర్వహించి గ్యారంటీ పథకాలకు ఒక కౌంటర్, ఇతర సమస్యలకు సంబంధించి మరో కౌంటర్ ఏర్పాటు చేసి దరఖాస్తులు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రతి దరఖాస్తుదారుకు రశీదు ఇస్తున్నామన్నారు. ఒకవేళ ఏదైనా కారణం చేత గ్రామ, వార్డు సభ నిర్వహించిన రోజు దరఖాస్తు సమర్పించని వారు వచ్చేనెల 6వ తేదీ వరకు సంబంధిత పంచాయతీ కార్యదర్శి లేదా వార్డు అధికారికి వారి దరఖాస్తులు అందించవచ్చన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఆర్డీఓ అనిల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్, వైద్యాధికారి రఫీ, వార్డు కౌన్సిలర్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగాలం శ్రమించే అన్నదాతలకు ఈ ఏడాది కూడా కష్టాలు, నష్టాలే మిగిలాయి. వానాకాలం మొదట్లో మురిపించిన వరుణుడు.. ఆ తర్వాత మొఖం చాటేయడంతో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో గత పదేళ్ల తర్వాత పాలమూరు ప్రాజెక్టులు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నాయంటే అర్థం చేసుకోవచ్చు. వానలు లేకపోవడంతో రైతులు పత్తి సాగుకే మొగ్గు చూపారు. దీంతో ఉమ్మడి జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో పత్తి సాగైనా.. రైతులు కనీసం మద్దతు ధరకు నోచుకోలేదు. వరి సాగు విస్తీర్ణం తగ్గినా ధరలు రూ.3 వేల పైచిలుకు వచ్చాయి. అయితే అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పాలమూరు-ఎత్తిపోతల పథకం మొదటి పంపును ప్రారంభించినా.. సాగునీటి విడుదలకు మాత్రం నోచుకోలేదు. ఈ క్రమంలో అన్నదాతలను ఆదుకోలేకపోయిన వ్యవసాయంపై 'సాక్షి' ఇయర్ రౌండప్..

- సాక్షి, నాగర్‌కర్నూల్

కష్టాలు.. నష్టాలే

ఈ ఏడాది వ్యవసాయంపై తీవ్రమైన వాతావరణ ప్రభావం



- వానాకాలంలో మొఖం చాటేసినవరుణుడు
- జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు గడ్డు పరిస్థితులు
- పత్తికి దక్కని మద్దతు.. మెరిసిన వరి ధరలు
- ఆశలు రేకెత్తించిన 'పాలమూరు' ప్రాజెక్టు మొదటి మోటారు ప్రారంభం
- అన్నదాతలను ఆదుకోలేకపోయిన వ్యవసాయం

రివైండ్ 2023

ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఈ ఏడాది వ్యవసాయ రంగంలో రైతులకు మిశ్రమ ఫలితాలు వచ్చాయి. గతేడాది పత్తి పంట క్వింటాల్‌కు రూ.9వేల వరకు మార్కెట్‌లో ధర పలకగా.. ఈసారి పత్తి రైతులకు నిరాశే మిగిల్చింది. వర్షాభావ పరిస్థితులు, అకాల వర్షాలు, తెగుళ్ల నేపథ్యంలో ఈ ఏడాది పత్తి పంట దిగుబడి బాగా తగ్గింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో ఈ ఏడాది వరి, పత్తి పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. మిగతా మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి జిల్లాల్లో రైతులు గతేడాది కన్నా ఈసారి వానాకాలంలో వరి, పత్తి పంటలను అధికంగా సాగుచేశారు.

'పాలమూరు' మోటారు ప్రారంభం

ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు సాగు, తాగునీరు అందించే పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు మొదటి మోటారును ఈ ఏడాది సెప్టెంబర్ 16న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా రైతులకు వరప్రదాయినిగా నిలిచే ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవంతో రైతుల్లో కొత్త ఆశలు నెలకొన్నాయి. ఈ ప్రాజెక్టు కింద చేపట్టిన నార్లాపూర్, ఏదుల, వట్టెం, కర్వెన తదితర రిజర్వాయర్ల నిర్మాణంతోపాటు పూర్తిస్థాయిలో మోటార్ల బిగింపు పూర్తయితేనే సాగునీరు అందనుంది. అలాగే రిజర్వాయర్ల నుంచి ఆయకట్టుకు నీరందించేందుకు డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లు, ఫీడర్ చానళ్ల నిర్మాణం చేపడితేనే రైతులకు ప్రయోజనం చేకూరుతుంది.



వరి, పత్తికే ప్రాధాన్యం..

ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో రైతులు అధికంగా వరి, పత్తి పంటలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి జిల్లాలో గతేడాది కంటే ఈసారి వరి, పత్తి పంటలను అధికంగా సాగు చేశారు. మహబూబ్‌నగర్‌లో ఈసారి వరి 20 వేలు, పత్తి 5 వేల ఎకరాల్లో అధికంగా సాగైంది. నారాయణపేటలో వరి గతేడాది కంటే 10 వేల ఎకరాల్లో అధికంగా సాగుచేశారు. ఇక్కడ అధికంగా 50 వేల ఎకరాల్లో కందిపంట సాగవుతోంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో గతేడాది 1,23,019 ఎకరాల్లో వరి సాగు కాగా.. ఈసారి 69,080 ఎకరాలకు పరిమితమైంది. అలాగే గతేడాదితో పోల్చితే పత్తి సాగు విస్తీర్ణం 23 వేల ఎకరాలు తక్కువగా నమోదైంది. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఈసారి పత్తిసాగు 70 వేల ఎకరాల వరకు తగ్గగా.. వరి పంట విస్తీర్ణం 8 వేల ఎకరాలు తక్కువగా నమోదైంది.

మద్దతు దక్కక నిరాశ..

ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా రైతులు పత్తిపంటను సాగుచేస్తున్నారు. ఇందులో నాగర్‌కర్నూల్ జిల్లాలో 3.50 లక్షలు, జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల్లో 2 లక్షల ఎకరాలకు మించి పత్తి సాగవుతోంది. మహబూబ్‌నగర్‌లో 80 వేలు, వనపర్తిలో తక్కువగా 17 వేల ఎకరాల్లోనే రైతులు పత్తి సాగు చేశారు. అయితే ఈ ఏడాది ప్రారంభం నుంచి పత్తి పంటకు సరైన ధర లేక రైతులు నిరాశలో ఉన్నారు. గతేడాది ఒక దశలో క్వింటాల్‌కు రూ.9 వేల వరకు పలికిన ధర ఈ సీజన్‌లో మాత్రం క్వింటా రూ.6500- 7 వేలు దాటలేదు. సీసీఐ ఆధ్వర్యంలో చేపడుతున్న పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద క్వింటాకు రూ.7,020 చొప్పున మాత్రమే మద్దతు ధర లభిస్తోంది. ఈసారి తగ్గిన దిగుబడి, సరైన ధర లేకపోవడంతో పెట్టుబడులు కూడా కలిసి రావడం లేదని రైతులు చెబుతున్నారు. అయితే వరికి మాత్రం మద్దతుకు మించి ధరలు లభించడం కాస్త ఊరటనిచ్చింది.

ఉమ్మడి జిల్లాలో సాగైన పంటల వివరాలు (ఎకరాల్లో)

పంట	వానాకాలం	
	2022	2023
మహబూబ్‌నగర్ జిల్లా		
వరి	1,70,176	1,92,828
పత్తి	80,449	85,637
మొక్కజొన్న	35,721	28,259
వేరుశనగ	204	3,629
కందులు	26,851	7,956
జొన్నలు	11,514	11,730
నాగర్‌కర్నూల్ జిల్లా		
వరి	1,23,019	69,080
పత్తి	3,30,577	3,53,655
మొక్కజొన్న	31,972	90,611
వేరుశనగ	371	1,784
కందులు	3,075	19,451
జొన్నలు	2,096	7,529
వనపర్తి జిల్లా		
వరి	1,83119	1,87544
పత్తి	12,643	17,421
మొక్కజొన్న	12,077	11,110
వేరుశనగ	5,112	10,048
కందులు	6,186	3,954
జొన్నలు	989	775
నారాయణపేట జిల్లా		
వరి	1,58,698	1,69,425
పత్తి	2,05,564	1,82,826
మొక్కజొన్న	50	60
వేరుశనగ	16,032	6,989
కందులు	50,353	50,886
జొన్నలు	721	650
జోగుళాంబ గద్వాల జిల్లా		
వరి	88,170	80,980
పత్తి	2,22,927	1,46,128
మొక్కజొన్న	9,365	12,812
వేరుశనగ	5,609	7,562
కందులు	12,601	22,528
జొన్నలు	117	95.18

■ ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాకు సంబంధించి 2022 వానాకాలం సీజన్‌లో 15,53,446 మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు 1,06,594 మంది రైతుల నుంచి 6,30,689 మెట్రిక్ టన్ను ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అదేవిధంగా 2023 వానాకాలంలో 13,95,973 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలనే లక్ష్యంతో అధికారులు ముందుకుసాగారు. ఇప్పటివరకు 25,872 మంది రైతుల నుంచి 3,18,460 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే సేకరించినట్లు అధికారిక రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. బయటి మార్కెట్‌లో సన్నాలకు ప్రభుత్వ మద్దతు ధర కంటే సుమారు రూ.వెయ్యి ఎక్కువ ఉండడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకే విక్రయాలు జరిపినట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

కారులో నుంచి రూ.1.50 లక్షలు చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: నిలిపి ఉంచిన కారులో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు నగదు అపహరించిన ఘటన గురువారం జిల్లాకేంద్రంలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. బిజినేపల్లి మండలం వడ్డెమాన్‌కు చెందిన చిదిరే శంకర్ వ్యక్తిగత అవసరాల నిమిత్తం బ్యాంకు నుంచి రూ.1.50 లక్షలు డ్రా చేసుకొని కారులో జిల్లాకేంద్రంలోని బస్టాండ్ వద్దకు వచ్చారు. కారును అక్కడే నిలిపి టీ తాగేందుకు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు కారు అద్దాలు పగలగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. శంకర్ టీ తాగి తిరిగి కారు వద్దకు వచ్చేసరికి అద్దాలు పగిలి ఉండటం, నగదు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

చిన్నచింతకుంట: ద్విచక్రవాహనంపైనుంచి పడి వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం చిన్నచింతకుంట మండలం ఉంద్యాల గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆర్ శేఖర్ వివరాల ప్రకారం.. నర్వ మండలం కొమరలింగంపల్లికి చెందిన గొల్ల కొండన్న(31) వ్యవసాయ పనులకు బుధవారం ఉంద్యాల నుంచి కూలీలను తీసుకెళ్లాడు. పనులు ముగిశాక సాయంత్రం కూలీలు వెళ్లిపోయారు. కూలీలకు డబ్బులు ఇచ్చేందుకు భరత్‌తో కలిసి కొండన్న ద్విచక్రవాహనంపై రాత్రి ఉంద్యాలకు వెళ్లాడు. కూలీలకు డబ్బులిచ్చి తిరుగు ప్రయాణంలో ఉంద్యాల సమీపంలో అడవిపంది అడ్డు వచ్చింది. దాన్ని తప్పించబోయి రోడ్డు పక్కనున్న చెట్టుకు ద్విచక్రవాహనం ఢీ కొట్టాడు. దీంతో కొండన్న తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. భరత్‌కు గాయాలు కావడంతో వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి ఎస్‌ఐ చేరుకోని మృతదేహాని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. కొండన్న భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అతనికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గడ్డి, పొట్టు వాములు దగ్ధం



కొత్తకోట రూరల్: మండలంలోని రాయిణిపేటలో గడ్డివాము, పొట్టువాము ప్రమాదవశాత్తు దగ్ధమైనట్లు బాధితులు గౌనికాడి గోవింద్, గౌనికాడి వెంకటయ్యలు తెలిపారు. బాధితుల వివరాల ప్రకారం గ్రామంలో తమ నివాసాల ముందు వేసుకున్న గడ్డివాము, పొట్టువాములకు ప్రమాదవశాత్తు మంటలు చెలరేగగా గమనించిన వారు వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో గడ్డి, పొట్టు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. కాలిపోయిన గడ్డి, పొట్టు దాదాపు రూ.1.50లక్షల ఆస్తి నష్టం జరిగిందని బాధితులు వాపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు బిల్ ముషాఫా పంచనామా చేసి అధికారులకు సమర్పించారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక సర్పంచ్ ఆకుల శ్రీనివాసులు ప్రభుత్వాన్ని కోరారు.

దంపతులకు తీవ్రగాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: గుర్తుతెలియని వాహనం ఢీకొని భార్యాభర్తలకు తీవ్రగాయాలైన ఘటన జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పట్టణ రెండో ఎస్సై రాంచందర్ తెలిపిన వివరాల ప్రకారం బొందలపల్లి గ్రామానికి చెందిన దంపతులు విష్ణు, నీలమ్మ ద్విచక్రవాహనంపై జిల్లా కేంద్రానికి వెళ్లారు. తిరుగుప్రయాణంలో స్వగ్రామానికి వస్తుండగా గుర్తుతెలియని వాహనం వారిని ఢీకొన్నది. ఈఘటనలో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పులిమామిడి ఆస్పత్రిని సందర్శించిన కేంద్ర బృందం



ఊట్కూరు: మండలంలోని పులిమామిడి ప్రభుత్వ ఆస్పత్రిని కేంద్ర అధికారుల బృందం గురువారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో మౌలిక వసతులను పరిశీలించారు. ఆస్పత్రి కంపౌండ్ వాల్, ల్యాబ్, మందుల గది, తదితర వాటిని తనిఖీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ డాక్టర్ సాయిరాం, సర్పంచ్ సూర్యగౌడ్, అధికారుల బృందం డాక్టర్ ఈశాసచిదేవా, ప్రదీప్‌సింగ్, డీఎంఅండ్ హెచ్‌ఓ సౌభాగ్య లక్ష్మీ, గౌతం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్ జాతరలో ఉద్రిక్తత



అయిజ -గద్వాల రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు, నాయకులు

- బండలాగుడు పోటీలను అడ్డుకున్న పోలీసులు
- అయిజ – గద్వాల ప్రధాన రహదారిపై రైతులు, కాంగ్రెస్ నాయకుల ధర్నా
- ఏఎస్పీ, డీఎస్పీలతో వాగ్వాదం
- రైతు సంబరాల ఆవరణ వద్ద పోలీసుల పహారా

మల్దకల్: జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్‌లో స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించే రైతు సంబరాలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. సంబరాల్లో భాగంగా నిర్వహించే బండలాగుడు పోటీలను నిలుపుదల చేసేందుకుగాను గురువారం ఉదయం 11గంటలకే ఏఎస్పీ, డీఎస్పీ ఇతర పోలీస్ అధికారులు అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో మల్దకల్‌కు చెందిన రాజు అనే యువకుడు వ్యవసాయ పొలానికి వెళ్తుండగా.. పోలీసులు అకారణంగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు రైతు సంబరాల ఆవరణకు చేరుకుని పోలీసులు, బీఆర్‌ఎస్ నాయకులకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. అయిజ – గద్వాల ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఆందోళనకారులకు పోలీసులు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా ససేమిరా అన్నారు. కేసులు చేసినా పర్వాలేదు.. బండలాగుడు పోటీలను కొనసాగిస్తామని డీఎస్పీ వెంకటేశ్వర్లుతో వాగ్వాదానికి దిగారు. ఒక దశలో పోలీసులు, నాయకుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. కాగా.. హైకోర్టు ఆదేశాల మేరకు బండలాగుడు పోటీలను నిర్వహించరాదని రైతు సంబరాల నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులకు ఏఎస్పీ, డీఎస్పీ తేల్చిచెప్పారు. పదేళ్లుగా లేని ఆదేశాలు ఇప్పుడెందుకు అమలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, బండ్ల రాజశేఖర్‌రెడ్డి, తిరుపతయ్య, బండారి భాస్కర్ వారిని ప్రశ్నించారు. ఎప్పటిలాగే రైతు సంబరాలు నిర్వహించేందుకు సహకరించాలని కోరగా.. అందుకు వారు నిరాకరించారు. దీంతో రైతులు పెద్దఎత్తున సంబరాల మైదానానికి చేరుకోవడం ఉద్రిక్తతకు దారితీసింది. మరోమారు ఆలయం సమీపంలోని రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. బండలాగుడు పోటీల ఆవరణలోకి ఎవరిని అనుమతించకుండా పోలీసులు పహారా చేపట్టారు. రైతులతో ఏఎస్పీ రవి మాట్లాడి అక్కడి నుంచి పంపించారు.



రైతు సంబరాలను అడ్డుకుంటున్న పోలీసులు

కక్షసాధింపు చర్యలు..

పదేళ్లుగా ఎలాంటి ఆటంకాలు లేకుండా రైతు సంబరాలు నిర్వహిస్తుండగా.. ఈ ఏడాది ఎమ్మెల్యే కావాలనే కోర్టును ఆశ్రయించి రైతు సంబరాలను అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. మల్దకల్ మండలంలో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ రావడంతో కక్ష్య సాధింపు చర్యలకు దిగుతున్నారని తెలిపారు. సంబరాలను అడ్డుకునే వారికి రైతులే తగిన బుద్ధి చెబుతారన్నారు.

144 సెక్షన్ అమలు

- అల్లర్లకు ప్రేరేపించిన వారిపై చర్యలు : ఎస్పీ రితిరాజ్



గద్వాల క్రైం: మల్దకల్ జాతర సందర్భంగా బండలాగుడు పోటీలు నిర్వహించే ప్రాంతంలో గురువారం నుంచి 31వ తేదీ వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్పీ రితిరాజ్ తెలిపారు. పలు పార్టీల నాయకుల మధ్య వైరం కారణంగా బండలాగుడు పోటీల పేరిట అల్లర్లు, హింసాత్మక ఘటనలకు ప్రేరేపిస్తున్నారన్న నిఘా వర్గాల సమాచారం మేరకు ఆంక్షలు విధించినట్లు వెల్లడించారు. జాతరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రజలకు ఇబ్బందులు సృష్టించాలని చూస్తే క్రిమినల్ కేసులు, పీడీయాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. జాతర ఉత్సవాలు ముగిసే వరకు పోలీసు సిబ్బందికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. నాయకుల ప్రోద్బలంతో అల్లర్లకు పాల్పడిన వారిని ఎంత మాత్రం ఉపేక్షించేది లేదన్నారు. బండలాగుడు పోటీల నిర్వహణ సందర్భంగా చోటుచేసుకున్న అల్లర్లపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామన్నారు. అల్లర్లకు ప్రేరేపించిన వ్యక్తుల జాబితా ఆధారంగా త్వరలో కేసులు నమోదు చేస్తామని ఎస్పీ తెలిపారు.

నియంత్రణ కష్టతరం!



జడ్చర్లలో నెలకొన్న ట్రాఫిక్ సమస్య

- రూరల్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు డిమాండ్
- అందని పోలీస్ సత్వర సేవలు
- 1.50 లక్షల జనాభాకు ఒకే ఠాణా
- వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య

జడ్చర్ల: రెండు జాతీయ రహదారులు కలయికతో పాటు పారిశ్రామికంగా, వ్యాపార వాణిజ్య పరంగా, తదితర అనేక రంగాలకు సంబంధించి నిత్యం రద్దీని సంతరించుకున్న జడ్చర్లలో పోలీసుల సత్వర సేవల ఆవశ్యకత ఎంతైనా ఉంది. సకాలంలో పోలీసుల సేవలు అందకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేగాక నేరాలు, తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై సరైన నిఘా పెట్టలేని పరిస్థితి నెలకొంది. వీటికి తోడు ట్రాఫిక్ సమస్యను కూడా స్థానిక పోలీసులే పర్యవేక్షించాల్సి రావడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. చోరీలు, తదితర నేరాల నియంత్రణ కష్టతరమైంది. వీటన్నింటి పరిష్కారానికి జడ్చర్లలో పోలీస్ సబ్‌డివిజన్ ఏర్పాటుతో పాటు ప్రత్యేకంగా రూరల్ పోలీస్ స్టేషన్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తే తప్పా సమస్యల పరిష్కారానికి నోచుకోలేని పరిస్థితి నెలకొంది.

రూరల్ స్టేషన్‌కు ఎదురుచూపులు..

జడ్చర్లలో రూరల్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రజలు ఎదురుచూస్తున్నారు. దశాబ్ద కాలంగా రూరల్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ బలంగా ఉంది. పట్టణం రోజు రోజుకు నలుదిక్కులా విస్తరిస్తుండటంతో పాటు ఓ వైపు 44వ నంబర్ జాతీయ రహదారి, మరో వైపు 167 నంబర్ జాతీయ రహదారి ఉన్నాయి. వీటితో పాటు మండల పరిధిలోని పోలేపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన సెజ్, గ్రీన్ ఇండస్ట్రియల్ ఏరియాతో నియోజకవర్గం కేంద్రంగా ఉన్న జడ్చర్ల పోలీస్‌స్టేషన్ బిజీబిజీగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో చోటు చేసుకుంటున్న పలు సమస్యలు సకాలంలో పరిష్కారానికి నోచుకోక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- జడ్చర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బాదేపల్లి, కావేరమ్మపేట(జడ్చర్ల) జంట పట్టణంతో పాటు మండల పరిధిలోని 45 గ్రామపంచాయతీలు, వాటి పరిధిలోని 23 అనుబంధ తండాలు, తదితర నివాస ప్రాంతాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో లక్షకు పైగా జనాభా ఉంది. ఒక్క జడ్చర్ల పట్టణంలోనే దాదాపు 80 వేలకు పైగా జనాభా ఉంది. ఇంత జనాభాకు సంబంధించి ఒకే ఒక పోలీస్‌స్టేషన్ ఉండటంతో ప్రజలకు సత్వర పోలీస్‌సేవలు అందడం లేదనే అపవాదు ఉంది.



జడ్చర్ల పోలీస్ స్టేషన్

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు..

జడ్చర్లలో పోలీస్ సబ్‌డివిజన్‌తో పాటు రూరల్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు సంబంధించి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రతిపాదనలు పంపించారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణ పనులకు అప్పటి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కొబ్బరికాయ కూడా కొట్టారు. ఇటీవల ఎన్నికల ప్రచార సభకు వచ్చిన అప్పటి సీఎం కేసీఆర్ కూడా రూరల్, ట్రాఫిక్ స్టేషన్ల ఏర్పాటుకు హామీ ఇచ్చారు. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఈ ప్రతిపాదనలు కూడా అటకెక్కే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా డివిజన్ కార్యాలయంతో పాటు రూరల్, ట్రాఫిక్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్యలతో..

పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతుండటంతో ట్రాఫిక్ నియంత్రణ కూడా పోలీసులే చూడాల్సి వస్తుంది. పట్టణంలోని నడిబొడ్డున జాతీయ రహదారులతో పాటు అంతర్రాష్ట్రీయ రహదారులు ఉన్నాయి. దీంతో వాహనాల రద్దీ తీవ్రంగా ఉంటుంది. రోడ్లు ఇరుగ్గా ఉండటంతో రాకపోకలు స్తంభించిపోతున్నాయి.

పనిభారంతో సతమతం..

జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది తలకు మించిన పనిభారంతో సతమతమవుతున్నారు. స్టేషన్‌లో సిబ్బంది కొరత కూడా వేధిస్తుంది. మండల పరిధిలోని సెజ్‌లో పరిశ్రమల సంఖ్య పెరుగుతుండటంతో అక్కడికి సంబంధించిన శాంతిభద్రతల సమస్యల పరిరక్షణ బాధ్యత పోలీసులపైనే ఉంటుంది. జిల్లాలోనే అధిక నేరాలు నమోదవుతున్న పోలీస్‌స్టేషన్లలో జడ్చర్ల ప్రధానంగా ఉంది. ప్రతి ఏడాది దాదాపుగా 500–600 వరకు కేసులు నమోదవుతున్నాయి. గత ఏడాది దాదాపు 800 పైచిలుకు కేసులు నమోదయ్యాయి.

ప్రజలకు అందుబాటులో సేవలు..



జడ్చర్ల పట్టణంతో పాటు మండల ప్రజలకు సకాలంలో సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. జడ్చర్ల మున్సిపాలిటీ మరియు గ్రామీణ ప్రాంతాలు, తండాలకు కలిపి ఒకే పోలీస్‌స్టేషన్ ఉంది. రూరల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటయితే ప్రజలకు మరింత సౌకర్యంగా ఉంటుంది.

–రమేశ్‌బాబు, సీఐ, జడ్చర్ల

ఏర్పాటుకు కృషి..



జడ్చర్లలో రూరల్ పోలీస్ స్టేషన్ అవసరం ఎంతో ఉంది. ఎన్నో సంవత్సరాలుగా ఇక్కడి ప్రజలు రూరల్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. రూరల్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుపై గత పాలకులు నిర్లక్ష్యం వహించారు. తమ హయాంలో రూరల్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు కృషి చేస్తాం. – అనిరుద్‌రెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

గువ్వలదిన్నె ఘటనపై అధికారుల సీరియస్



వివరాలు సేకరిస్తున్న అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్

కేటీదొడ్డి: కేటీదొడ్డి మండలం గువ్వలదిన్నె గ్రామంలో ప్రజాపాలన దరఖాస్తులను లాక్కెళ్లిన ఘటనపై జిల్లా ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణపై బుధవారం గువ్వలదిన్నెలో పంచాయతీ కార్యదర్శి మీర్జాఅలీ బేగ్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తుండగా.. కాంగ్రెస్ పార్టీ నాయకులు కొందరు దరఖాస్తు ఫారాలను లాక్కెళ్లారు. ఈ ఘటనపై 'సాక్షి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అదనపు కలెక్టర్ అపూర్వ చైహాన్ గురువారం గువ్వలదిన్నె గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించారు. మొత్తం 223 దరఖాస్తులను తీసుకెళ్లినట్లు గుర్తించారు. ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని గ్రామాల్లో పోలీస్ బందోబస్తు మధ్య దరఖాస్తుల స్వీకరణకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కాగా కాంగ్రెస్ నాయకులు తీసుకెళ్లిన దరఖాస్తు ఫారాలను ఎస్‌ఐ వెంకటేష్ సేకరించి, అధికారులకు అప్పగించారు. అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ సరితరాణి, డీటీ శివశంకర్, ఆర్‌ఐ ఉదయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మీ-సేవ కేంద్రం ఎదుట ఆందోళన



ఈడీ ఇలియాస్‌తో వాగ్వాదానికి దిగిన ప్రజలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని మీ–సేవ కేంద్రం నిర్వాహకుల పనితీరు బాగా లేదంటూ గురువారం మధ్యాహ్నం కొద్దిసేపు ప్రజలు ఆందోళనకు దిగారు. మహబూబ్‌నగర్ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి సుమారు 200 మంది అక్కడి రాగా కేవలం 40 మందికి మాత్రమే ఆధార్‌లో కొందరివి ఈ–కేవైసీ, మరికొందరివి అప్‌డేట్, ఇంకొందరివి కొత్తగా నమోదు చేశారు. దీంతో మిగతా వారు తమకు ఎప్పుడు అవకాశం కల్పిస్తారని నిర్వాహకులను నిలదీశారు. అలాగే వృద్ధులు, దివ్యాంగులు, బాలింతలు, మహిళల పట్ల దురుసుగా వ్యవహరించారని వాపోయారు. ఈ విషయం తెలుసుకున్న ఆధార్ జిల్లా ఈడీ ఇలియాస్ అక్కడికి చేరుకోగా వారు వాగ్వాదానికి దిగారు. చివరకు బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇవ్వడంతో శాంతించారు. అనంతరం మరో 20 మంది వివరాలను నమోదు చేసుకోగా మిగతా వారు వెనుదిరగాల్సి వచ్చింది.

న్యాయవాదిపై దాడి

పాలమూరు: ఓ న్యాయవాదిపై కొందరు వ్యక్తులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. కొకుంట్ల మండలం వెంకటగిరికి చెందిన సోమిరెడ్డి లక్ష్మారెడ్డి మహబూబ్‌నగర్‌లో నివాసం ఉంటూ జిల్లా కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తూ.. జిల్లా బార్ అసోసియేషన్ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. గురువారం వెంకటగిరిలో లక్ష్మారెడ్డిపై కొందరు ఇనుప రాడ్లు, కట్టెలతో దాడి చేసి కొట్టడంతో గాయాలయ్యాయి. గాయపడిన అతడికి ప్రస్తుతం జిల్లా జనరల్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. భూ వివాదంలో దాడి జరిగినట్లు తెలుస్తోంది. చికిత్స పొందుతున్న లక్ష్మారెడ్డిని పలువురు న్యాయవాదులు పరామర్శించారు. ఈ దాడి ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని దేవరకద్ర పోలీసులు తెలిపారు.

మునగ సాగు.. మంచి లాభాలు



మునగ తోట,మునగ కాయలు, పూత

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: ప్రకృతి వైపరీత్యాలతో అన్నదాతలు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. వర్షాధార పంటలు సాగు చేయడం గగనంగా మారింది. ఈ పరిస్థితులను అధిగమించడానికి రైతులు మునగ సాగుపై దృష్టి సారిస్తున్నారు. మునగ సాగు గతంలో బహు వార్షిక పంటగా ఉండేదని.. ప్రస్తుతం ఏక వార్షిక రకాలు అందుబాటులోకి వచ్చాయని అలంపూర్ ఏడీఏ సక్రియానాయక్ చెబుతున్నారు. సాగునీటి వసతి కింద ఏకకాలంలో సాగు చేసుకోవచ్చని వివరించారు.

ప్రయోజనాలు..

మునగలో మాంసకృతులు, ఖనిజ లవణాలు, ఐరన్, కాల్షియం, భాస్వరం, విటమిన్–సి, ఏ ఉంటాయి. ఆకుల నుంచి తీసిన రసానికి బ్యాక్టీరియాను తట్టుకొనే శక్తి ఉంటుంది. గింజల నుంచి బెన్ ఆయిల్ లభిస్తోంది. మునగ చెక్క నుంచి నీలం రంగు డైని తయారుచేసే అవకాశం ఉంటుంది.

రకాలు..

పీకేఎం–1, పీకేఎం–2, జీకేదికే–1, జీకేదికే–2.

- పీకేఎం–1 : ఈ రకం అధిక ప్రాచుర్యం పొందినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. చెట్టు 6 మీటర్ల ఎత్తు పెరుగుతుంది. 90 నుంచి 100 రోజుల్లో పూత దశకు చేరుకుంటుంది. మొదటి కోత 150 నుంచి 170 రోజుల్లో వస్తుంది. ఏడాదికి ఒక చెట్టు 250 నుంచి 280 కాయలు కాస్తోంది.

ఒక్కో కాయ 90 నుంచి 100 సెంటీమీటర్లు పొడవు, 140 గ్రాముల బరువు ఉంటుంది.

సాగు విధానం..

పంట సాగు సులభతరంగా ఉంటుంది. ఎకరాకు 250 గ్రాముల నుంచి 300 గ్రాముల విత్తనాలు అవసరం. 5 గీ9 అంగుళాల పాలిథిన్ సంచుల్లో ఎర్రమట్టి, పశువుల ఎరువులు, ఇసుక 2:1:1 నిష్పత్తిలో నింపి నీరుపోసి ఆరబెట్టాలి.

- ఒక్కో సంచిలో ఒక్కో విత్తనం నాటి సంచి కింది భాగంలోకి వెళ్లడనికి 6 నుంచి 8 రంధ్రాలు చేయాలి.
- నెలరోజుల తర్వాత పొలంలో 2.5 గీ2.5 మీటర్ల దూరంలో ఎకరాకు 640 నుంచి 650 వరకు మొక్కలు నాటాలి.

నీటి యాజమాన్య పద్ధతులు..

పొలంలో మొక్కలు నాటిన వెంటనే నీరు పట్టాలి. తర్వాత వాతావరణ పరిస్థితుల ఆధారంగా 7 నుంచి 10 రోజులకు ఒకసారి నీరందించాలి. పూత సమయంలో నీటి పారుదలలో ఒడిదుడుకులు ఉంటే పూత రాలిపోతుంది. కాపు సమయంలో 4 నుంచి 6 రోజులకు ఒకసారి నీరు పడితే పంట దిగుబడి పెరుగుతుంది.

ఎరువుల వినియోగం..

పొలంలో మొక్కలు నాటే సమయంలో రెండు కిలోల పశువుల ఎరువు, 250 గ్రాముల వేప పిండి, 250 గ్రాముల సూపర్ వేయాలి. మొక్క నాటిన 3, 6, 9 నెలలకు ఒకసారి మొక్కకు 100 గ్రాముల యూరియా, 75 గ్రాముల పొటాష్ వేసి నీరందించాలి.

పించింగ్..

పొలంలో నాటిన మొక్క మూడు అడుగులు పెరిగిన తర్వాత కొన చివర్లను తుంచి వేయాలి. దీంతో పక్క కొమ్మలు అధికం అవుతాయి. పక్క కొమ్మ ఒకటి నుంచి రెండు అడుగులు పెరిగిన తర్వాత దాని చివర్లు తుంచి వేయాలి. దీంతో పక్క కొమ్మలపై చిరు కొమ్మలు ఏర్పడి చెట్టు గుబురుగా అవుతుంది.

రెండో పంట..

మొదటి పంట తీసుకున్న తర్వాత మొక్కలను నేల నుంచి మూడు అడుగులు వదిలి కత్తిరించాలి. ఇలా చేయడంతో కొత్త కొమ్మలు వస్తాయి. ఎరువులు వేసి మట్టిని ఎగదోయాలి. నెల తర్వాత ఒక్కో మొక్కపై 5 నుంచి 6 కొమ్మలు ఉంచి మిగిలిన వాటిని తీసివేయాలి. సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మూడేళ్ల వరకు పంట తీసుకోవచ్చు.

పోటెత్తిన భక్తులు



చిన్నరాజమూర్‌లో భక్తుల సందడి



ఆంజనేయస్వామి మూలవిరాట్‌కు పూజలు చేస్తున్న అర్చకులు

దేవరకద్ర: మండలంలోని చిన్నరాజమూర్ జాతరకు గురువారం భక్తులు పోటెత్తారు. ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, పల్లకి సేవ కార్యక్రమాలు నిర్వహించారు. కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. కల్యాణకట్ట వద్ద తలనీలాలు సమర్పించే భక్తులతో నిండిపోయింది. స్వామివారికి దాసంగాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు పొర్లు దండాలతో, మరికొందరు గండజ్యోతులతో ప్రదక్షిణలు చేశారు. స్వామి వారికి ఆవులను, కోడెలను సమర్పించుకున్నారు.

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీ క్రికెటర్ అంబటి రాయుడు



సాక్షి,అమరావతి: టీమిండియా మాజీ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో గురువారం ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనకు సీఎం జగన్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాజకీయాలు తన సెకండ్ ఇన్నింగ్స్ అని మాజీ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు తెలిపారు. సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరడం చాలా సంతోషంగా ఉందన్నారు. మొదటి నుంచి సీఎం జగన్ మీద మంచి అభిప్రాయం ఉందని, ఆయన కులమతాలు, రాజకీయాలతో పనిలేకుండా పారదర్శకంగా పాలన చేస్తున్నారని ప్రశంసించారు. అందుకే ఆయనకు మద్దతుగా గతంలో ట్వీట్లు పెట్టినట్లు పేర్కొన్నారు. సంక్షేమ పథకాలపై చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చాలా ఆరోపణలు చేశారని, అయితే ఇప్పుడు వారే అంతకంటే ఎక్కువ ఇస్తామని ఎలా చెప్తారని ప్రశ్నించారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని రాయుడు అన్నారు.

‘కెప్టెన్’ విజయకాంత్ కన్నుమూత

- విషాదంలో మునిగిన ఆయన అభిమానులు, పార్టీ శ్రేణులు
- ప్రధాని మోదీతోపాటు పలువురు రాజకీయ, సినీ ప్రముఖుల సంతాపం
- నివాళులర్పించిన తమిళనాడు సీఎం స్టాలిన్
- నేడు చెన్నైలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

అనారోగ్యంతో ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచిన డీఎండీకే అధ్యక్షుడు



చెన్నైలో విజయ్‌కాంత్ భౌతికకాయాన్ని కడసారి చూసేందుకు బారులు తీరిన అభిమానులు

సాక్షి, చెన్నై: డీఎండీకే అధ్యక్షుడు, తమిళ సినీ నటుడు విజయకాంత్ (71) అనారోగ్యంతో కన్నుమూశారు. చెన్నైలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం 6.10 గంటలకు తుది శ్వాస విడిచారు. ఈ సమాచారంతో ఆయన అభిమానులతోపాటు ఆ పార్టీ శ్రేణులు విషాదంలో మునిగిపోయాయి. విజయకాంత్ మృతితో సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం 4.45 గంటలకు చెన్నై కోయంబేడులోని డీఎండీకే పార్టీ ప్రధాన కార్యాలయం ఆవరణలో విజయకాంత్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు. తమిళనాడు రాజకీయాల్లో ప్రధాన పాత్రను పోషించిన, పోషిస్తున్న వారంతా సినీరంగానికి సుపరిచితులే అన్న విషయం తెలిసిందే. ఇందులో విజయకాంత్ కూడా ఒకరు. సినీ రంగంలో పురట్చి కలైంజ్ఞర్‌గా, కెప్టెన్‌గా పేరుగడించిన విజయకాంత్ 2005లో డీఎండీకే (దేశీయ ముర్పోగు ద్రావిడ కళగం) పార్టీ ఏర్పాటుతో రాజకీయాల్లోకి ప్రవేశించారు. డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలకు ప్రత్యామ్నాయంగా నిలిచే ప్రయత్నం చేసిన ఆయన తమిళ రాజకీయాల్లో ఓ ఆశాదీపంగా కనిపించారు.

మరణంతో విషాదం...

విజయకాంత్ గత నెలలో మూడు వారాలు ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఈ సమయంలో అనేక వదంతులు వచ్చాయి. అయితే గత వారం జరిగిన డీఎండీకే పార్టీ సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరుకావడంతో అభిమానులు, కేడర్‌లో ఆనందం వెల్లివిరిసింది. ఈ క్రమంలో మళ్లీ అస్వస్థతకు గురికావడంతో మంగళవారం రాత్రి చెన్నైలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన గురువారం కన్నుమూశారు. తొలుత ఆయన పార్థివ దేహాన్ని చెన్నై శాలిగ్రామంలోని నివాసంలో ఉంచారు. ఈ సందర్భంగా సీఎం స్టాలిన్‌తోపాటు పలువురు ప్రముఖులు విజయకాంత్‌కు అంజలి ఘటించారు. అనంతరం కోయంబేడులోని పార్టీ ప్రధాన కార్యాలయానికి భౌతికకాయాన్ని తీసుకొచ్చారు. విజయకాంత్‌కు నివాళులర్పించేందుకు ప్రముఖులతోపాటు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పలు పార్టీల నేతలు, సినీ ప్రముఖులు ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు.

ప్రముఖుల సంతాపం

విజయకాంత్ మృతి పట్ల ప్రధాని మోదీ, తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, పి.చిదంబరం, టీఎన్‌సీసీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, దివంగత సీఎం జయలలిత నెచ్చెలి శశికళ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై, సినీనటుడు కమల్‌హాసన్‌తోపాటు పలు పార్టీల నేతలు సంతాపం వ్యక్తంచేశారు. ‘విజయకాంత్ మరణం నన్ను ఎంతగానో కలచివేసింది. తమిళ సినీ ప్రపంచంలో దిగ్గజమైన ఆయన లక్షలాది మంది అభిమానుల మనసు గెలుచుకున్నారు. రాజకీయ నేతగా ప్రజలకు ఎంతగానో సేవచేసిన ఆయన తమిళనాడు రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారు’ అని మోదీ ‘ఎక్స్’లో పోస్ట్‌చేశారు.

‘కరుప్పు ఎంజీఆర్’గా...

అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు దివంగత ఎంజీఆర్ ఆశయ సాధన నినాదం, ఆయనే ఆదర్శంగా రాజకీయాల్లోకి వచ్చిన విజయకాంత్ ‘కరుప్పు ఎంజీఆర్’ (నల్ల ఎంజీఆర్)గా గుర్తింపు పొందారు. 2006 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన పార్టీ పోటీచేయగా, తానొక్కడే గెలిచినా 8.2 శాతం ఓట్లు సాధించి తమిళ రాజకీయాల్లో కీలకంగా మారారు. 2011 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేను గద్దె దింపాలన్న లక్ష్యంతో జయలలిత (అన్నాడీఎంకే).. విజయకాంత్ పార్టీతో పొత్తు పెట్టుకున్నారు. ఆ ఎన్నికల్లో ఆయన పార్టీ 41 స్థానాల్లో బరిలో దిగగా, 29 చోట్ల గెలిచి రెండో అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఆ ఎన్నికల్లో ఆ కూటమి అధికారంలోకి వచ్చింది. దీంతో అప్పటివరకు అధికారంలో ఉన్న డీఎంకే మూడో స్థానానికి పరిమితమైంది. ఆ తదుపరి అసెంబ్లీ వేదికగా అన్నాడీఎంకే అధినేత్రి, సీఎం జయలలితతో తలెత్తిన విభేదాల కారణంగా విజయకాంత్ అనేక సమస్యలు ఎదుర్కొన్నారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే, అన్నాడీఎంకేలకు ప్రత్యామ్నాయంగా ఉండేందుకు ఎన్‌డీఏ నేతృత్వంలోని కూటమిలో చేరారు. ఆ ఎన్నికల్లో ఆయన పార్టీ ఒక్క స్థానంలోనూ గెలవకపోగా, ఓటు బ్యాంకు ఐదు శాతానికి పడిపోయింది. తర్వాత 2016 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్షాలతో కలిసి పీపుల్స్ వెల్ఫేర్ ఫ్రంట్‌గా తన నేతృత్వంలోనే కూటమి ఏర్పాటు చేశారు. అందులో విజయకాంత్‌నే కూటమి తరఫున ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించారు. కానీ, ఆ ఎన్నికల్లో డీఎండీకే ఒక్క సీటు కూడా గెలవకపోగా, 2.4 శాతం ఓట్లకే పరిమితమైంది. చివరకు రాష్ట్ర పార్టీ గుర్తింపు కూడా కోల్పోయింది. ఈ రెండు ఎన్నికలు నిరాశ పరిచినా, రాజకీయంగా వెనకడుగు వేయకుండా ముందుకు సాగిన విజయకాంత్‌ను తర్వాత అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. దీంతో పార్టీని విజయకాంత్ సతీమణి ప్రేమలత తన భుజాన వేసుకుని నడిపిస్తున్నారు. పెద్దకుమారుడు విజయ ప్రభాకరన్ రాజకీయాల్లో, చిన్న కుమారుడు షణ్ముగ పాండియన్ సినీ రంగంలో అడుగుపెట్టారు.

విజయరాజ్ నాయుడు...

విజయకాంత్ తమిళనాడులోని మదురైలో స్థిరపడ్డ తెలుగు సంతతికి చెందిన కుటుంబంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు కేఎస్ అళగర్‌స్వామి, ఆండాళ్ అళగర్‌స్వామి. విజయకాంత్ అసలు పేరు విజయరాజ్ నాయుడు అన్న విషయం కొందరికే తెలుసు.

లోకేశ్‌కు నోటీసులు జారీచేయండి

- విజయవాడ ఏసీబీ న్యాయస్థానం ఆదేశం
- లోకేశ్ అరెస్ట్‌కు అనుమతించాలన్న ఏపీ సీఐడీ పిటిషన్‌పై విచారణ
- తదుపరి విచారణ జనవరి 9కి వాయిదా

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి కేసుల్లో చంద్రబాబుకు రిమాండ్ విధింపును తప్పుబట్టడంతోపాటు కీలక సాక్షులుగా ఉన్న అధికారులను బెదిరిస్తూ వ్యాఖ్యలు చేసిన నారా లోకేశ్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఈ వ్యవహారంలో ఆయనకు నోటీసులు జారీచేయాలని విజయవాడ ఏసీబీ న్యాయస్థానం గురువారం ఆదేశించింది. లోకేశ్‌ను అరెస్ట్ చేసేందుకు అనుమతించాలన్న సీఐడీ పిటిషన్‌పై న్యాయస్థానం కీలక ఆదేశాలివ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో 41ఏ నోటీసు కింద సీఐడీ విచారణకు హాజరైన సందర్భంగా విధించిన ఆంక్షలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించడం, ఈ కేసుల్లో కీలక సాక్షులుగా ఉన్న అధికారులు, న్యాయస్థానంలో వాంగ్మూలాలు ఇచ్చిన అధికారుల పేర్లను రెడ్‌బుక్‌లో రాశానని.. వారి సంగతి తేలుస్తానని లోకేశ్ ఇటీవల పలు మీడియా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో బెదిరించడం కలకలం రేపింది. గతంలో విధించిన ఆంక్షలను ఉల్లంఘించడంతోపాటు కేసు దర్యాప్తును ప్రభావితం చేసేందుకు యత్నిస్తున్న ఆయన్ని అరెస్ట్ చేసేందుకు అనుమతి కోరుతూ సీఐడీ విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌పై విచారించిన విజయవాడ ఏసీబీ న్యాయస్థానం ఈ అంశంలో లోకేశ్‌కు నోటీసులు జారీచేయాలని ఆదేశించింది. ఆయన్ని అరెస్ట్ చేసేందుకు అనుమతించాలన్న సీఐడీ పిటిషన్‌పై సమాధానం చెప్పాలని ఆ నోటీసుల్లో పేర్కొనాలని తెలిపింది. ఈ కేసులో తదుపరి విచారణను వచ్చే ఏడాది జనవరి 9కు వాయిదా వేసింది.

రేపు రావాలని సీఐడీ అధికారులకు చెప్పిన లోకేశ్ వ్యక్తిగత సిబ్బంది

టీడీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి కేసుల్లో కీలక సాక్షులుగా ఉన్న ఉన్నతాధికారులను బెదిరించే రీతిలో చేసిన వ్యాఖ్యలపై కోర్టు నోటీసులు అందించేందుకు వెళ్లిన సిబ్బందికి లోకేశ్ అందుబాటులోకి రాలేదు. ఈ కేసులో లోకేశ్‌ను అరెస్ట్ చేసేందుకు అనుమతించాలని సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌పై సమాధానం చెప్పాలని ఆయనకు నోటీసులు జారీచేయాలని విజయవాడ ఏసీబీ న్యాయ స్థానం ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో ఆయనకు నోటీసులు అందించేందుకు సీఐడీ అధికారులు కృష్ణా కరకట్ట మీద ఉన్న నివాసానికి గురువారం వెళ్లారు. ఆ సమయంలో లోకేశ్ నివాసంలో ఉన్నా బయటకు రాలేదు. అధికారులు చాలాసేపు నిరీక్షించినా ఫలితం లేకపోయింది. నోటీసులు అందించేందుకు శుక్రవారం రావాలని లోకేశ్ వ్యక్తిగత సిబ్బంది చెప్పారు. దీంతో సీఐడీ అధికారులు నోటీసులు అందించకుండానే వెనుదిరిగారు.

విశ్వసనీయత చాటుకున్నాం

అవ్వాతాతలకు పెన్షన్ల పెంపు నుంచి అక్కచెల్లెమ్మలకు హామీలన్నీ పూర్తిగా నెరవేరుస్తున్నాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: అవ్వాతాతలకు పెన్షన్ల పెంపుతో పాటు అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత పథకాలను అమలు చేస్తూ ఎన్నికల హామీలను పూర్తిగా నెరవేర్చడం ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విశ్వసనీయతకు మారుపేరు అని మరోసారి రుజువు చేసుకుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఇదే సందేశాన్ని అవ్వాతాతలతో పాటు ప్రతి లబ్ధిదారుడికీ, ప్రతి గడప వద్దకు తీసుకెళ్లాలని అధికార యంత్రాంగానికి సూచించారు. జనవరిలో మూడు కార్యక్రమా లతో పాటు ఫిబ్రవరిలో ఒక కార్యక్రమం కలిపి మొత్తం నాలుగు ప్రధాన కార్యక్రమాలను తలపెట్టామని, వీటి ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి పొరపాట్లు దొర్లకుండా బ్రహ్మాండంగా జరిగేలా కలెక్టర్లు, జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ప్రతి కార్యక్రమానికి నిర్దేశించిన విధంగా ప్రీ లాంచ్, లాంచ్, పోస్ట్ లాంచ్ కార్యక్రమాలు సక్రమంగా జరిగేలా కలెక్టర్లు షెడ్యూల్ చేసుకోవాలని సూచించారు. జనవరి 1 నుంచి 8 వరకు ‘వైఎస్సార్ పెన్షన్ కానుక’ రూ.3 వేలకు పెంపు కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నామని, రెండో కార్యక్రమంగా జనవరి 19న విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నామని, మూడోది జనవరి 23 నుంచి 31 వరకు ‘వైఎస్సార్ ఆసరా’ కార్యక్రమాన్ని తలపెట్టగా నాలుగో కార్యక్రమం ‘వైఎస్సార్ చేయూత’ ఫిబ్రవరి 5 నుంచి 14 వరకు జరుగుతుందని జగన్ ప్రకటించారు. ఈ నాలుగు కార్యక్రమాలను ప్రభుత్వం చాలా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందని కలెక్టర్లకు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి జగన్ గురువారం తన క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, ఉన్నతాధి కారులకు దీనికి సంబంధించి దిశానిర్దేశం చేశారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఇవీ 4 కార్యక్రమాలు..

జనవరి 1 – 8:	వైఎస్సార్ పెన్షన్ కానుక రూ.3 వేలకు పెంపు
జనవరి 19:	విజయవాడలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ
జనవరి 23 – 31:	వైఎస్సార్ ఆసరా
ఫిబ్రవరి 5 – 14:	వైఎస్సార్ చేయూత

30న ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఈనెల 30న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అండర్–17 విభాగం బాల, బాలికల హ్యాండ్‌బాల్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రమేష్‌బాబు గురువారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎంపికలు ఉంటాయని, ఉమ్మడి జిల్లా క్రీడాకారులు పాఠశాల ఒరిజనల్ బోనఫైడ్, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని కోరారు. వివరాల కోసం 7013072546, 9948787711 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

పీఠాధిపతులకు ఘన స్వాగతం



జడ్చర్ల టౌన్: మండలంలోని దేవునిగుట్టతండ వద్ద ఉన్న శ్రీగిరిక్షేత్రం అష్టలక్ష్మి ఆలయానికి వచ్చిన పీఠాధిపతులకు గురువారం రాత్రి ఘన స్వాగతం పలికారు. శ్రీఆదిశంకర బ్రహ్మ విద్యాపీఠం సోమాశ్రమం ఉత్తరకాశీ పీఠాధిపతి శ్రీ హరిబ్రహ్మేంద్ర తీర్థస్వాములు, అల్వార్ రాజస్థాన్ పీఠాధిపతి శ్రీ ఉత్తమానందస్వామి, రుషికేష్ పీఠాధిపతి శ్రీ దేవానంద సరస్వతి, బద్రినాథ్ గణేశానందసరస్వతి స్వాములతోపాటు వివిధ పీఠాధిపతులు 30మంది అష్టలక్ష్మి ఆలయానికి చేరుకున్నారు. నమామి శంకరం పేరుతో శ్రీశైలం సుండిపెంటపూర్ణానంద స్వామిజీ ఆశ్రమంలో నిర్వహించిన ప్రస్థానత్రయి భాష్య పారాయణం కార్యక్రమంలో పాల్గొని తిరుగు ప్రయాణంలో యాదగిరిగుట్ట వెళ్తూ స్వాములు ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి వచ్చిన స్వాములకు ఆచార్య కృష్ణస్వామి నేతృత్వంలో వైస్‌చైర్‌పర్సన్ పాలాది సారిక, వార్డుకౌన్సిలర్ జ్యోతిలతోపాటు భక్తులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వాములకు పాదపూజ చేశారు. పాదపూజ తరువాత పీఠాధిపతులు ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఉత్తర కాశీ సోమాశ్రమం పీఠాధిపతి శ్రీ హరిబ్రహ్మేంద్ర తీర్థస్వాములు మాట్లాడుతూ శంకరాచార్య అద్వైత వేదాంతాలను వివరిస్తూ దక్షిణభారత దేశ యాత్ర చేస్తున్నామన్నారు. యాత్రలో భాగంగా శ్రీశైలంలో 10రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించి యాదగిరిగుట్ట వెళ్తున్నామని, అక్కడ అద్వైత వేదాంత ప్రచారం చేస్తూ ముందుకు సాగుతామన్నారు. ఆత్మజ్ఞానం పొందటమే శంకరాచార్య బోధించిన అద్వైతంగా ఆయన అభిప్రాయపడ్డారు.

ఆలయాల సమస్యలపై సుదీర్ఘ చర్చ

- తీర్మానం చేసిన అంశాలపై అమలే లేదని మండిపాటు
- జోగుళాంబ ఆలయ పాలకమండలి ఒక్కసారి కూడా ఆలయానికి రాలేదని నిలదీత



పాలకమండలి సమావేశంలో పాల్గొన్న సభ్యులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ ఆలయాల పాలక మండలి సమావేశం ఈఓ పురేందర్ కుమార్ నేతృత్వంలో గురువారం చైర్మన్ చిన్నకృష్ణయ్య అధ్యక్షతన గురువారం వాడీవేడిగా సాగింది. సుమారు గంట పాటు ప్రశ్నోత్తరాలు, ఒకరి తప్పులు మరొకరు ఎత్తి చూపారు. ఇదిలా ఉండగా ఆదివారం ‘అయ్యో..దేవుడా!’ శీర్షికన సాక్షి దినపత్రికలో వైకుంఠ ఏకాదశి రోజు యోగనారసింహ స్వామి ఆలయం మూసివేశారనే అంశంపై కథనం రావడంపై ప్రధానంగా చర్చకు దారి తీసింది. దీనిపై ధర్మకర్త అంపయ్య యోగ నారసింహ స్వామి ఆలయం మన పరిధిలోకే వస్తుందా? అని ఈవో ప్రశ్నించగా అవునని సమాధానం చెప్పారు. మరి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఎందుకు చేయలేదని ప్రశ్నించగా.. ఇక్కడ మొదటి నుంచి చేయడం లేదని మీరు తీర్మానం చేస్తే ఘనంగా నిర్వహిద్దామని సమాధానం ఇచ్చారు. అర్చకుడు దేవళ్ల పృథ్వినాథ్ శర్మ మాట్లాడుతూ.. వైకుంఠ ఏకాదశి రోజు స్వామి వారి దివ్యమంగళవిగ్రహం బాగా కనిపించాలని చందనంతో అలంకరించామని, విగ్రహంపై వస్త్రాన్ని కప్పినట్లు తెలిపారు. దేవుడికి పూల అలంకరణ, మామిడి తోరణాలు ఎందుకు కట్టలేదని ప్రశ్నించగా? ఆ బాధ్యత తనది కాదని అయినా మీరు ఏ ఒక్క సారైన ఆలయానికి వచ్చారా అని కమిటీ సభ్యులని ప్రశ్నించారు.

విగ్రహాలు తీసుకువచ్చారా?

ఇటీవల ఓ టీవీ చానెల్ వారు నిర్వహించిన కోటి దీపోత్సవంలో జోగుళాంబ దేవి విగ్రహాన్ని ఇతర ఆభరణాలను తీసుకెళ్లారని, ఎవరిని అడిగి తీసుకెళ్లారని, అవి తిరిగి వచ్చాయా లేదా అని నిలదీశారు. ఈవో సమాధానం ఇస్తూ దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాలతో తీసుకెళ్లామని, తీసుకెళ్లిన విగ్రహం జోగుళాంబ సేవా సమితి వారిదని తెలిపారు. ధర్మకర్త వెంకటేష్ మాట్లాడుతూ ఉద్యోగులు రిజిస్టర్‌లో ప్రతి రోజు సంతకాలు చేయడం లేదన్నారు. మరో ధర్మకర్త మాట్లాడుతూ తాను ఇటీవల ఓ ప్రేమవివాహానికిథాలయంలో అనుమతి ఇవ్వాలని ఆదేశిస్తే పట్టించుకోలేదన్నారు. ప్రేమవివాహాలను అనేక నిబంధనలు ఉంటాయని అలాంటి వాటిని అనుమతించమని ఈవో చెప్పారు. సమావేశం మధ్యలో ఓ ధర్మకర్త భర్త మాట్లాడబోగా పాలక మండలి ఎక్స్ అఫీషియో మెంబర్ కల్పించుకుని మీరు ధర్మకర్త కాదని, సమావేశానికి రావడమే తప్పని చెప్పడంతో ఆయన బయటకు వెళ్లిపోయారు. ఇప్పటికీ మూడు పర్యాయాలు సమావేశం నిర్వహిస్తే పాలకమండలిలో చేసిన ఏ ఒక్క తీర్మానం అమలుకు నోచుకోక పోవడంతో సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సభ్యులు వెంకటేశ్వర్‌రెడ్డి, చంద్రకళ, సురేఖ, వెంకటనారాయణరెడ్డి, వెంకటేష్, సత్యన్న, కేశన్న, అడవప్ప, రమేష్ బాబు, అంపయ్య, ఆనంద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ ఎక్కి యువకుడి హల్‌చల్

- ఆరు నెలల కిందట ఇదే బెదిరింపు..



రాంచందర్ ఎక్కిన సెల్‌టవర్ ఇదే..



రాంచందర్‌కు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ జనార్దన్

కోస్గి: పట్టణ శివారులోని బీఎస్ఎన్ఎల్ టవర్‌పైకి ఎక్కిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకుంటానని డయల్ 100కు ఫోన్ చేసి హల్‌చల్ చేసిన ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. అన్నదమ్ములు భూమిలో సరిగా భాగం ఇవ్వడం లేదని, అడిగితే దాడి చేస్తున్నారని, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వస్తే పోలీసులు సైతం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ మండలంలోని చంద్రవంచకు చెందిన రాంచందర్ ఈ ఏడాది జూన్ 25న తాగిన మైకంలో పోలీస్‌స్టేషన్‌లోని సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. తాజాగా అదే యువకుడు గురువారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో బీఎస్ఎన్ఎల్ టవర్ ఎక్కాడు. మధ్యాహ్నం 2 గంటలకు డయల్ 100కు కాల్‌చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని బెదిరించాడు. 250 అడుగుల ఎత్తు ఉన్న టవర్‌పై నుంచి ఆ యువకుడిని కిందకి దించేందుకు పోలీసులు ప్రయత్నించారు. తాగిన మైకంలో టవర్ ఎక్కి అక్కడే నిద్రపోయాడు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ శ్రీనివాస్‌తో పాటు పోలీసులు అక్కడే ఏడు గంటల పాటు ఉండి పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరించారు. ఎత్తు ఎక్కువగా ఉండటంతో టవర్‌పైకి వెళ్లేందుకు ఎవరూ ధైర్యం చేయలేదు. చివరకు మత్తు దిగడం.. చలి ఎక్కువ కావడంతో అతడే కిందకు రావడంతో స్థానికులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి సీఐ జనార్దన్ కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేశారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన వీసీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ బుధవారం ఆవిష్కరించారు. నూతన సంవత్సరంలో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ గిరిజ మంగతాయారు, ఆడిట్‌సెల్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి, కంట్రోలర్ రాజ్‌కుమార్, ఐక్యూఏసీ డైరెక్టర్ కిషోర్‌కుమార్, పిండి పవన్ కుమార్, ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ తదితరులు పాల్గొన్నారు.



నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్

వైభవంగా రాములోరి కల్యాణం



సీతారాముల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ఎర్రవల్లిచౌరస్తా: శ్రీరాముని జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో గురువారం సీతారాముల కల్యాణ వేడుకను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భువనచంద్ర, దత్తుస్వాముల ఆధ్వర్యంలో సీతారాములను అందంగా ముస్తాబుచేసి వేదమంత్రాల నడుమ వైభవంగా కల్యాణాన్ని జరిపారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

పడమటి అంజన్నకు అశ్వవాహన సేవ

మక్తల్: మక్తల్ పడమటి ఆంజనేయస్వామికి గురువారం అశ్వవాహన సేవ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు అశ్వవాహనంపై ఊరేగారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చక్రతీర్థ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు.. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భీమాచారి, ఈఓ శ్యాంసుందర్‌చారి, పూజారి ప్రాణేష్‌కుమార్ పాల్గొన్నారు.



అశ్వవాహన సేవ నిర్వహిస్తున్న పండితులు

అవసరమైన వాటికే దరఖాస్తు చేసుకోండి

- దరఖాస్తుదారులతో నోడల్ అధికారి టీకే శ్రీదేవి

బాలానగర్: ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలు వారికి ఏది అవసరమో గుర్తించి వాటికోసం మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లా నోడల్ అధికారి టీకే శ్రీదేవి అన్నారు. గురువారం మండలంలోని పెద్దరేవల్లిలో ప్రజాపాలన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. దరఖాస్తులు నింపడంలో జాగ్రత్త వహించాలని సూచించారు. ఏది అవసరమో వాటినే టిక్ చేయాలని ఇంతకు పూర్వం పింఛన్ వస్తుంటే తిరిగి టిక్ చేయాల్సిన అవసరం లేదన్నారు. దరఖాస్తు నింపడంలో ఇబ్బంది ఉంటే గ్రామసభలోనే ఒకరిని సాయం ఇస్తామని తెలిపారు. కేవలం రూ.500 గ్యాస్ కనెక్షన్ కోసం మాత్రమే దరఖాస్తు చేసుకుంటే నంబర్ ఇస్తే సరిపోతుందని తెలిపారు. అందుకోసమే వేర్వేరుగా కౌంటర్లు ఏర్పాటు చేశామని, ప్రజలు నేరుగా ఆయా కౌంటర్ల వద్దే సమర్పించాలని సూచించారు. గ్రామ సభల వద్ద ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట జిల్లా అదనపు కలెక్టర్ మోహన్‌రావు, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ నర్మద ఉన్నారు.



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న నోడల్ అధికారి టీకే శ్రీదేవి

రామన్‌పాడుకు 163 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో గురువారం 1,019 అడుగులకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 163 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ రనిల్ రెడ్డి తెలిపారు.